# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 46 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 20 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :46 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 20 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




### రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి
## చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

- నేడు విజయదశమి
- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా
- ఈ పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి

- మిగతా 2లో



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు దసరా శుభాకాంక్షలు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం పత్రికకు సెలవు. బుధవారం పునః ప్రారంభం.

## స్థానిక సంస్థల్లోనూ కూటమికి
# జై కొట్టండి

### సీఎం చంద్రబాబు పిలుపు



- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు.

పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని,

- మిగతా 2లో



### 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు
## వాయిదా వేయండి
### ఈసీకి వైసీపీ వినతి

- 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయాలని ఈసీని కోరిన వైసీపీ
- టీడీపీ దాడులతో నామినేషన్లు వేయలేకపోయామని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషనర్‌కు వీడియో ఆధారాలు అందజేత
- 488 వార్డుల్లో అభ్యర్థులు లేకుండా పోయారని ఫిర్యాదులో వెల్లడి
- కుప్పం ఛైర్మన్ అభ్యర్థి కిడ్నాప్ అయ్యారని, పలువురిపై దాడులు జరిగాయని ఆందోళన

రాష్ట్రంలోని 22 పట్టణ స్థానిక సంస్థల్లో కొత్తగా నామినేషన్లు స్వీకరించాలని లేదా ఎన్నికలను వాయిదా వేయాలని వైసీపీ నేడు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) కోరింది. అధికార టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ అభ్యర్థులను

- మిగతా 2లో







## ఏపీ లోకల్ వార్... స్నేహపూర్వక పోటీ తప్పట్లేదే... !

రాష్ట్రంలో కూటమి పార్టీల మధ్య సఖ్యత బాగానే ఉన్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో మాత్రం స్నేహ పూర్వక పోటీ తప్పేలా కనిపించడం లేదు. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు జనసేన నాయకులు ఎక్కడా తగ్గలేదు. అధికారికంగా పార్టీకి 4 కార్పొరేషన్లు, 21 మునిసిపాలిటీలే దక్కినా.. క్షేత్రస్థాయి నాయకులు, పార్టీ కోసం పనిచేసిన వారు మాత్రం సై అంటూ ఈ ఎన్నికల్లో సీట్ల కేటాయింపుతో సంబంధం లేకుండానే రంగంలోకి దిగారు. దీంతో ఆయా స్థానాల్లో మిత్ర బేధం రాకుండా.. స్నేహ పూర్వక పోటీ చేయడమే మంచిదన్న భావన వ్యక్తమవుతోంది.

**ఎక్కడెక్కడ ?**

మూడుచోట్ల మేయర్ స్థానాలకు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ స్థానాలకు.. టీడీపీ-జనసేన, బీజేపీ-జనసేన, టీడీపీ-బీజేపీల మధ్యే పోరు సాగనుంది. ఆయా పార్టీలనేతలు కాదు కాదంటూనే నామినేషన్లు వేసేశారు. అదేమంటే తమకు బలం ఉన్న స్థానాలను వేరే పార్టీలకు కేటాయించారని కూడా చెబుతున్నారు. ఇక,ఒకటి రెండు స్థానాల్లో అయితే.. ఒకే పార్టీకి చెందిన నాయకులు ఇద్దరి నుంచి ముగ్గరు వరకు పోటీ పడుతున్నా రు. ఈ పరిణామాలు.. ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. నాయకుల మధ్య ఉన్న ఆకాంక్షకు అద్దం పడుతున్నాయి.ముఖ్యంగా విజయనగరం కార్పొరేషన్ మేయర్ పదవికి టీడీపీ, జనసేన పోటీ పడుతున్నాయి. వాస్తవానికి టీడీపీకే కేటాయించినా.. జనసేన మాత్రం తగ్గేది లేదంటూ పోటీకి దిగింది. ఇక, డివిజన్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పది డివిజన్లలో జనసేన నామినేషన్ వేసింది. ఏలూరు కార్పొరేషన్ జనసేనకు కేటాయించగా టీడీపీ అభ్యర్థి కూడా మేయర్ పీఠానికి నామినేషన్ వేశారు. విశాఖ కార్పొరేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరో కీలకమైన విజయవాడ కార్పొరేషన్ పరిధిలోనూ జనసేన, టీడీపీలు వార్డుల వారీగా నామినేషన్లు వేశాయి.

**ఏం చేయాలి ..?**

ఇలా కూటమి పార్టీల నాయకులే విరివిగా నామినేషన్లు వేయడంతో అనివార్యంగా పోటీ తప్పకపోవచ్చు. ఇలాంటి సమయంలో నామినేషన్లను ఉపసంహరించుకునేలా నాయకులను బుజ్జగించడం తొలి మార్గం. అప్పటికీ సాధ్యం కాకపోతే.. పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం. అది కూడావర్కవుట్ అవకపోతే.. స్నేహపూర్వకంగానే ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మంచి-చెడులను ప్రజలే తేలుస్తారు. మొత్తంగా.. ఆయా ప్రాంతాల్లో స్నేహ పూర్వక పోటీ తప్పదన్న సంకేతాలు అయితే వస్తున్నాయి. అయితే.. ఉపసంహరణకు గడువు ఉన్న నేపథ్యంలో ఏం చేస్తారన్నది చూడాలి.

### ఒక్క ఓటు కూడా చీలకూడదు.. విజయవాడలో
## వంగవీటి రాధాను గెలిపించుకుందాం

- మొదటి పేజి తరువాయి

రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది.ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది. కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.

## అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్.. కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాను ఏర్పాటు చేసే నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన వేళ ఎలాన్ మస్క్ స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు.'ఆంత్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' ను ఏర్పాటు చేసి సంస్థలో 5 శాతం వాటాలను ఈ నిధికి కేటాయిస్తామని ఆంత్రోపిక్ ప్రకటించింది. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతిసారీ మరో 2 శాతం వాటాలను అదనంగా కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదేవిధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించనున్నట్లు ఆంత్రోపిక్ తెలిపింది.ఈ ప్రకటనపై మస్క్ స్పందిస్తూ.. వాటాలను ప్రజానిధికి చేరవేసే బదులు.. నేరుగా ప్రజలకే ఇవ్వాలని ఎక్స్ వేదికగా సూచించారు. 'నేను కూడా భవిష్యత్‌లో ఇదే చేయబోతున్నా' అని ప్రకటించారు. ఏ కంపెనీ షేర్లు అనేది తొలుత వెల్లడించనప్పటికీ.. తర్వాత స్పేస్‌ఎక్స్‌లో ఒక్కో షేరును ప్రతి పిల్లాడికీ కేటాయించనున్నట్లు మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత స్పేస్ ఎక్స్ షేరు ధర 146.03 డాలర్లు ఉంది.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీ అధ్యక్షుడు**

తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

## 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి

నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసింది.వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, నారాయణమూర్తి తదితరులు కమిషనర్‌ను కలిసి దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను, మూడు వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలు తమ నామినేషన్ పత్రాలను చించివేశారని, కొన్నిచోట్ల పోలీసులు వారికి సహకరించగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులే స్వయంగా పత్రాలను లాక్కున్నారని ఆరోపించారు.ఈ 22 పురపాలక సంఘాల్లో మొత్తం 809 వార్డులు/డివిజన్లు ఉండగా, కేవలం 321 చోట్ల మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగలిగారని వైసీపీ వివరించింది. మిగిలిన 488 చోట్ల తమ పార్టీ తరఫున అభ్యర్థులే లేకుండా చేశారని, 8 మున్సిపల్ ఛైర్మన్ పదవులకు కూడా నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపింది. మైదుకూరులో 19 నామినేషన్ పత్రాలను చించివేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం అక్కడ ఎన్నికలను వాయిదా వేసిందని, అదే తరహా చర్యలు ఈ 22 ప్రాంతాల్లోనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, అవినాశ్ రెడ్డిపై జరిగిన దాడులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు, కనిగిరిలో స్క్రూటినీ కేంద్రాల్లోనే నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. ప్రొద్దుటూరు, కుప్పంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, కుప్పంలో ఛైర్మన్ అభ్యర్థి విజయ్ కుమార్ అపహరణకు గురయ్యారని, ఆయన ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అపహరణకు గురైన అభ్యర్థులను వెంటనే కాపాడి, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు.సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని, హింసకు పాల్పడిన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ బీసీ సర్టిఫికెట్ల అంశాన్ని నిబంధనల ప్రకారం, ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా పరిశీలించాలని కోరారు. ఏకగ్రీవాలను ప్రకటించే ముందు బాధితులైన తమ అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.

రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాన్ని నంబర్ వన్ గమ్యస్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు.మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200-300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆకలి కేకలు.. నివేదికలో షాకింగ్ విషయాలు!

ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టాప్ 10 దేశాల జాబితాలో పాకిస్థాన్ చేరింది. ఆర్థిక ఒత్తిళ్లు, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలు, సహాయం అందడంలో తగ్గుదల వంటి కారణాలతో ఆ దేశంలో ఆహార అభద్రత రోజురోజుకు తీవ్రమవుతోందని ఒక నివేదిక హెచ్చరించింది. 'ప్రాఫిట్ బై పాకిస్థాన్ టుడే' విశ్లేషణ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల్లో 266 మిలియన్ల మంది తీవ్రమైన ఆకలితో అల్లాడుతున్నారు. ఈ సంఖ్య దశాబ్దం క్రితంతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం.తీవ్ర ఆహార సంక్షోభంతో బాధపడుతున్న వారిలో దాదాపు మూడింట రెండొంతుల మంది, అంటే సుమారు 177 మిలియన్ల ప్రజలు కేవలం పది దేశాల్లోనే ఉన్నారు. ఆ జాబితాలో పాకిస్థాన్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియా, కాంగో, సూడాన్, యెమెన్, మయన్మార్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. జనాభా శాతంతో కాకుండా, ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్య ఆధారంగా పాకిస్థాన్‌ను ఈ జాబితాలో చేర్చినట్లు నివేదిక స్పష్టం చేసింది.

పాకిస్థాన్‌లోని 51 గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 1.06 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలు వాతావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి. 2018-19లో 15.92 శాతంగా ఉన్న మధ్యస్థ, తీవ్ర ఆహార అభద్రత కలిగిన కుటుంబాల సంఖ్య, 2024-25 నాటికి 24.35 శాతానికి పెరిగింది. అంటే.. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒక కుటుంబం ఆహార కొరతతో ఇబ్బంది పడుతోంది. ఇదే సమయంలో తీవ్రమైన ఆహార అభద్రత 2.37 శాతం నుంచి 5.04 శాతానికి పెరిగి రెట్టింపయింది. పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీబీఎస్) గణాంకాల ప్రకారం.. జూన్ 2019 నుంచి జూన్ 2025 మధ్య కాలంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) 117 శాతం పెరగడం ఆర్థిక ఒత్తిళ్లకు అద్దం పడుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, గ్రామీణ కుటుంబాల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ప్రజలు ఆహారం కోసం మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ కాలంలో ప్రజలు గోధుమలు, బియ్యం, పప్పులు, మాంసం, గుడ్లు, పాల వినియోగాన్ని తగ్గించారని, అయితే వనస్పతి నెయ్యి వాడకం మాత్రం 81 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. ఆదాయం తగ్గడం, ధరలు పెరగడం వంటి కారణాలతో పాక్‌లో ఆహార లభ్యత, కొనుగోలు సామర్థ్యం రెండూ దెబ్బతిన్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్స్కీ

- మొదటి పేజి తరువాయి

కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్స్కీ పేర్కొన్నారు."మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు.గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

నేడు (అక్టోబరు 20) విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతన్నల శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు."ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో హనీట్రాప్

- మొదటి పేజి తరువాయి

బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించా రు.పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను విశ్లేషించగా వేల సంఖ్యలో వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. అతని బాధితుల జాబితాలో వందలాది మంది ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు.ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..
## కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

# విజయదశమి శుభాకాంక్షలు - మాగుంట



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 19**

జిల్లా ప్రజలందరూ శ్రీ దుర్గామాతను పూజించి, అమ్మవారి ఆశీస్సులు పొంది, మంచిగా జీవించుచూ సుఖ - శాంతులు, విజయాలు పొందాలని కోరుతూ.. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టి.డి.పి.యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా 11 రోజులపాటు దసరా పండుగను ప్రజలు జరుపుకొంటారని పేర్కొన్నారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు అన్ని రాత్రులు జగన్మాత దుర్గాదేవి మహిషాసురునిపై యుద్ధం చేసి, అష్టమినాడు వధించి, విజయం పొందిన సందర్భంగా 11 వ రోజు ప్రజలు సంతోషంతో విజయదశమి పండుగ జరుపుకుంటారని తెలిపారు. ఇదే రోజున శ్రీరాముడు రావణునిపై విజయం సాధించిన దానికి పాండవులు వనవాసాన్ని దిగ్విజయంగా పూర్తిచేసి జమ్మి చెట్టుపై పెట్టిన ఆయుధాలను తిరిగి తీసుకొనేదానికి ప్రతీకగాను ప్రజలు విజయదశమి పండుగ జరుపుకుంటారని తెలిపారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## గోపాల కృష్ణుని అలంకారంలో వేంకటేశ్వరుడు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 19**

గిద్దలూరు పట్టణంలో ని శరాఫ్ బజార్లో వెలసిన శ్రీబెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు సోమవారం న్డడు గోపాల కృషుని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ ఆలయంలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాసలతో సర్వావంగా సుందరంగా అలంకరించారు. వేకువ ఝాము నుండే స్వామికి విశేష పూజలు నిర్వహిస్తారు. స్వామిని నిత్యం వేలాదిమంది భక్తులు దర్శించుకుని పునీతులౌతున్నారు. స్వామీ మూలమూర్తి కి , ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన అర్చకులు తోటపల్లి చంద్ర శేఖర్ శాస్త్రి అలంకారాలు నిర్వహింస్తూ భక్తుల ను ఆకర్షిస్తున్నారు. స్వామికి ప్రధాన సేవలు నిర్వహిస్తున్నారు. సోమవారం గోపాల కృష్ణుని అలంకారం కన్నులకు కట్టినట్లుగా చేశారు. ఆలయంలో క్యూ ఏర్పాట్లను తీర్థ ప్రసాదాల పంపిణీ ని ఆలయ కమిటీ అధ్యక్షులు గంజి వీరయ్య, ఉపాధ్యక్షులు పెద్దయ్య , ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు లు పర్య వేక్షించారు . వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు

# పల్లె రాజకీయం.. రసవత్తర పోరు..!

### - రచ్చబండలపై ఎన్నికల లెక్కలు.. అభ్యర్థుల బలాబలాలపై చర్చలు
### - అభివృద్ధి, సంక్షేమం, స్థానిక సమస్యలే ప్రధాన అజెండా
### - కూటమి, వైసీపీ మధ్య పోటీపై ఆసక్తి - కొత్త ముఖాలకు అవకాశాలపై గ్రామాల్లో చర్చ

**మార్కాపురం (జిల్లా స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ అక్టోబర్ 19**

మార్కాపురం జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. పట్టణంలో మున్సిపల్ ఎన్నికల హడావుడి కనిపిస్తుండగా, పల్లెల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. ఉదయం టీ దుకాణాల దగ్గర మొదలయ్యే మాటలు సాయంత్రానికి రచ్చబండలపైకి చేరుతున్నాయి. ఏ గ్రామంలో ఎవరు బరిలో ఉంటారు. ఎవరికి ప్రజాదరణ ఉంది,స్థానిక సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఎవరికి ఉంది, అన్న అంశాలపై గ్రామాల్లో ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పైగా పాలన, వైసీపీ గత పాలనతో పాటు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలూ చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**స్థానిక సమస్యలే ఎన్నికల ఎజెండా**

గ్రామాల్లో ఎన్నికల ప్రస్తావన వచ్చినప్పుడల్లా రోడ్లు, తాగునీరు, పారిశు ధ్యం, వీధిలైట్లు, సాగునీటి వసతులు ప్రధానంగా వినిపిస్తున్నాయి. గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకుడిని ఎన్నుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ మద్దతుతో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టవచ్చని కూటమి శ్రేణులు చెబుతుండగా, స్థానిక సమస్యలపై అభ్యర్థుల చిత్తశుద్ధి, గతంలో వారు చేసిన పనులే విజయానికి కీలకమవుతాయని వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి. మొత్తంగా పార్టీ గుర్తింపుతో పాటు అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజలతో ఉన్న సంబంధాలు కూడా ఫలితాలను ప్రభావితం చేసే అవకాశముంది.

**కొత్త జిల్లాలో రాజకీయ ప్రతిష్ఠకు పరీక్ష..**

కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో జరిగే ఎన్నికలు స్థానిక రాజకీయాలకు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మార్కాపురం, పొదిలి, దర్శి, యర్రగొండపాలెం, గిద్దలూరు ప్రాంతాల్లో గ్రామస్థాయి నాయకత్వం, స్థానిక సమస్యలు, అభివృద్ధి అవసరాలు ప్రధాన చర్చాంశాలుగా మారాయి. జిల్లా కేంద్రంగా మార్కాపురం అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, తాగునీటి వసతులు, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అధికార కూటమి తన పాలనలో చేపట్టిన



కార్యక్రమాలను ప్రస్తావిస్తుండగా, వైసీపీ స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

**వ్యవసాయ పరిస్థితుల ప్రభావం..**

పొదిలి, దర్శి, యర్రగొండపాలెం, కొమరోలు, గిద్దలూరు ప్రాంతాల్లో వ్యవసాయ పరిస్థితులు, ఉపాధి అవకాశాలు కూడా ఎన్నికల చర్చల్లో భాగమవుతున్నాయి. వర్షపాతం, సాగునీటి లభ్యత, పంటల పరిస్థితి, కూలీలకు పనులు దొరికే అంశాలు గ్రామీణ కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి. రైతులకు అవసరమైన సౌకర్యాలు, వ్యవసాయ అనుబంధ ఉపాధి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై అభ్యర్థులు ఏ విధమైన హామీలు ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తులో అందాల్సిన ప్రయోజనాలపైనా ఓటర్లు చర్చించుకుంటున్నారు.

**రిజర్వేషన్లతో కొత్త నాయకత్వానికి అవకాశం..**

పంచాయతీల్లో అమలైన రిజర్వేషన్లు మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో కొత్త ముఖాలు రాజకీయ రంగంలోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. మహిళలు, యువత పోటీకి ఆసక్తి చూపుతుండటంతో గ్రామస్థాయి నాయకత్వంలో మార్పులపై చర్చ జరుగుతోంది. అయితే కొత్తవారికి అవకాశం ఇవ్వాలా, అనుభవం ఉన్నవారిని ఎంపిక చేసుకోవాలా, అన్న అంశంపై గ్రామాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థుల సామర్థ్యం, అందుబాటులో ఉండే స్వభావం, గ్రామాభివృద్ధిపై వారి ప్రణాళికలు కీలకం కానున్నాయి.

**కూటమిలో సమన్వయం.. వైసీపీ వ్యూహాలు..**

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికలను ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, స్థానికంగా ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల పోటీ ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో స్నేహపూర్వక పోటీలు, వ్యక్తిగత పరిచయాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ కూడా తన స్థానిక బలాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తోంది. గ్రామాల్లో పార్టీ నాయకత్వం, కార్యకర్తల సమీకరణ, అభ్యర్థులకు ఉన్న వ్యక్తిగత ఆదరణ పోటీలో కీలక పాత్ర పోషించనున్నాయి. రాష్ట్రస్థాయి రాజకీయాలకు భిన్నంగా, కొన్ని పంచాయతీల్లో వ్యక్తిగత సంబంధాలు, కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాలు కూడా ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు.

**ప్రచారంలో స్థానిక అంశాలకే ప్రాధాన్యం.**

ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ఇంటింటి ప్రచారం, చిన్న సమావేశాలు, స్థానిక నాయకులతో చర్చల ద్వారా అభ్యర్థులు ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అవకాశం కల్పిస్తే గ్రామంలో చేపట్టే పనులు, పరిష్కరించాల్సిన సమస్యలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధానాన్ని వివరిస్తున్నారు. పార్టీ నాయకులు రాష్ట్రస్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తుండగా, ఓటర్లు మాత్రం తమ గ్రామానికి ప్రత్యక్షంగా ఏ ప్రయోజనం చేకూరుతుందనే అంశంపై దృష్టి సారిస్తున్నారు.

**ఎవరి వైపు గ్రామీణ ఓటరు..**

మార్కాపురం జిల్లాలో ఎన్నికల సందడి పెరుగుతున్నా, ఓటరు మొగ్గు ఏ వైపు ఉందనే విషయంపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం కష్టం. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల అభిప్రాయం, వైసీపీ స్థానికంగా సాధించే సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, గ్రామాల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కొత్త జిల్లాలో గ్రామీణ రాజకీయాలు ఏ దిశగా సాగనున్నాయో తేలాలంటే నామినేషన్ల ఉపసంహరణ, ప్రచార సరళి, ఓటర్ల స్పందనను గమనించాల్సిందే. ప్రస్తుతానికి మాత్రం టీ దుకాణాల నుంచి రచ్చబండల వరకు పల్లె రాజకీయాలే ప్రధాన చర్చగా మారాయి.

## తెలుగుదేశం మాజీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డి ఇంటి వద్ద కారు, మోటార్ సైకిల్ ధ్వంసం

### దుశ్చర్యకు పాల్పడ్డ దుండగులు

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ మల్లికార్జున, క్లూస్ టీం





**అర్థవీడు, పెన్ పవర్, అక్టోబర్ 19**

తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన కారు, మోటార్ సైకిల్ ధ్వంసానికి గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ వాహనాలను ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కంభం సీఐ మల్లికార్జున సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయనతో పాటు క్లూస్ టీం సభ్యులు కూడా ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. వాహనాలను ఎవరు ధ్వంసం చేశారు? ఈ ఘటనకు గల కారణాలేమిటి? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలను పరిశీలిస్తూ, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై అర్ధవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వాహనాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై అవగాహన

### నామినేషన్లకు అవసరమైన పత్రాలు, ఎన్నికల నియమావళి పై రాజకీయ పార్టీలకు దిశానిర్దేశం

**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 19**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండో సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై పుల్లల చెరువు మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల దాఖలుకు అవసరమైన పత్రాలు, ఎన్నికల నియమ నిబంధనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తదితర అంశాలపై మండల రిటర్నింగ్ అధికారి ఈ.వి. రమణ రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నామినేషన్ పత్రాలను నిబంధన లకు అనుగుణంగా పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరగకుండా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల మార్గదర్శ కాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని తెలిపారు.ఎన్నికల నియమావళిని.

**తప్పనిసరిగా పాటించాలి**

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారద ర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన అనంతరం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వివరించారు.ప్రచార కార్యక్రమాలు నిర్వహించే సమయంలో నిబంధనలు ఉల్లంఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎన్నికల నిర్వహ ణకు సంబంధించి అధికారుల సూచనలు, ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలను రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పాటించాలని రిటర్నింగ్ అధికారి ఈ.వి. రమణ స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రి యలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

### - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 19**





స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా చెప్పారు. ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు తీరు, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల సందర్భంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, నిబంధనల ఉల్లంఘనలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, తదితర అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఘర్షణలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని అనిల్ చంద్ర స్పష్టం చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లను వెంటనే స్కాన్ చేసి డిజిటల్ రూపంలో కూడా భద్రం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్లకు చెప్పారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ వద్ద కల్పించాల్సిన భద్రత విషయంలోనూ, ఓట్ల లెక్కింపునకు పట్టాల్సిన ఏర్పాట్ల విషయంలోనూ ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినందున ఆయా విషయాలలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన పునరుద్ఘాటించారు. స్థానికంగా పోలీసు సిబ్బంది లభ్యత, వెబ్ లైవ్ కాస్టింగ్ ను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు కేంద్రాల విషయంలో జిల్లా కలెక్టర్లు నిర్ణయం తీసుకోవచ్చని అనిల్ చంద్ర తెలిపారు. జిల్లాలలోని పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఎన్నికల పరిశీలకులకు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకురాలు హెప్సిబా రాణి, ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి.వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ విభాగ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు కార్పొరేషన్ తో సహా అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

-మాజీమంత్రి శిద్దా



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 19**

విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర మాజీమంత్రి డా. శిద్దా రాఘవరావు రాష్ట్ర ప్రజలకు,ప్రకాశం జిల్లా వాసులకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా మనం ఈ పండుగ జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. చెడు పైన విజయం గా విజయదశమి పండగ అని, జగజ్జనని ఆశీస్సులు మీకు మీ కుటుంబాలకు ఉండాలని ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ శుభం కలిగేలా జగన్మాత ఆశీస్సులు ఉండాలని,మీరు చేపట్టిన ప్రతి పని విజయవంతం కావాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు మాజీమంత్రి డా. శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి

### ఎన్నికల ప్రత్యేక అధికారిని నిర్మలాదేవి



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 19**

స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేలా అందరూ సహకరించాలని మండల ఎన్నికల ప్రత్యేక అధికారిని జి కె. నిర్మల దేవి కోరారు. ఆమె మండల ఎన్నికల ప్రత్యేక అధికారినిగా సోమవారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలాదేవి మాట్లాడుతూ ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు, నామినేషన్ల పత్రాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము, ఎన్నికల నియమావళి వంటి వాటిపట్ల అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నిర్మలాదేవి చెప్పారు. ఎన్నికల ప్రశాంతతకు ఎటువంటి భంగం వాటిల్లిన, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎన్నికలు ప్రజాస్వామ్య బద్దంగా జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 19**

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా 11 రోజులపాటు దసరా పండుగను ప్రజలు జరుపుకొంటారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు అన్ని రాత్రులు జగన్మాత దుర్గాదేవి మహిషాసురునిపై యుద్ధం చేసి, అష్టమినాడు వధించి, విజయం పొందిన సందర్భంగా 11 వ రోజు ప్రజలు సంతోషంతో విజయదశమి పండుగ జరుపుకుంటారు. ఇదే రోజున శ్రీరాముడు రావణునిపై విజయం సాధించిన దానికి , పాండవులు వనవాసాన్ని దిగ్విజయంగా పూర్తిచేసి జమ్మి చెట్టుపై పెట్టిన ఆయుధాలను తిరిగి తీసుకొనేదానికి ప్రతీకగాను ప్రజలు విజయదశమి పండుగ జరుపుకుంటారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు శ్రీ దుర్గామాతను పూజించి, అమ్మవారి ఆశీస్సులు పొంది, మంచిగా జీవించుచూ సుఖ - శాంతులు విజయాలు పొందాలని కోరుచూ మీకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము.

# మన బాల్యం.. మన మధుర స్మృతులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

**పెన్ పవర్, కంభం అక్టోబర్ 19**



వారు అందరూ చిన్ననాటి స్నేహితులు. ఎప్పుడో బాల్యంలో కలిసి చదువుకొని, ఆపై ఉన్నత చదువులు మరియు వృత్తి రీత్యా విడి పోయి ఎవరి జీవనాలు వారు కొనసాగిస్తూ రెండు తెలుగు రాష్ట్రలతో పాటు దేశ, విదేశాలలో నివసిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇద్దరు మహిళా మిత్రుల చొరవతో 2022 వ సంవత్సరం నాడు దాదాపు 100 మంది బాల్య స్నేహితులు కలిసి మన బాల్యం మధుర స్మృతులు పేరిట ఒక గ్రూప్ ఏర్పరచుకొని ప్రతి రెండు వసంతాలకు ఒక మారు ఆత్మీయ స్నేహ సమ్మేళనం నిర్వహించుంకుంటూరు. ఈ ఏడాది ముచ్చటగా మూడవ ఆత్మీయ సమ్మేళనమును ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. 1980వ దశకం తొలి నాళ్ళలో జన్మించి, కంభం పట్టణంలోని వివిధ పాఠశాలలో ఓనమాలు దిద్దుకొని, బాల్య స్నేహితులుగా మారిన 1996-97 బ్యాచ్ కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు అందరూ ఆనాడు వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను అందరినీ ఒకే వేదిక పై చూసి పులకించి పోయిన అద్భుతమైన దృశ్యం కంభం లో ఆవిష్కృతం అయింది. కంభం బైపాస్ రోడ్ లోని మన్నాన్ ఫంక్షన్ హాల్ వేదికగా కన్నుల పండుగగా సాగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి వివిధ ప్రాంతాల నుండి 20 మంది గురువులు తరలి వచ్చారు. కంభంలోని దాస్, అరవింద, ఆది ఆంధ్ర,జడ్పీ బాలికల పాఠశాల, రంగరాజు హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 30 సంవత్సరాల క్రితం చదువుకొని నేడు వివిధ వృత్తులలో కొనసాగుతున్న వేళ స్వస్థలంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాటి గురువులను చూసిన విద్యార్థినీ, విద్యార్థులు వారితో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకొని భావోద్వేగం తో పాదాభివందనాలు చేసి ఆశీస్సులు పొందారు. గురువుల తరపున ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రస్తుత ఇంటర్ బోర్డు ఆర్.ఐ.ఓ మరియు రాష్ట్ర స్థాయిలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా కొనసాగుతున్న సైమన్ విక్టర్ ఈ బ్యాచ్ విద్యార్థులతో తనకున్న అనుబంధాన్ని, తాను ఆరోజుల్లో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేసిన నాటి రోజులను, నాటి విలువలను గుర్తు చేసుకొని, మన బాల్యం ద్వారా తమ శిష్య బృందం చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, చదువుకున్న పాఠశాలలో పేద విద్యార్థులకు సహాయం చేస్తూ,సామాజిక స్పృహతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గురువులందరు ప్రసంగిస్తూ తమ శిష్యులకు మంచి మాటలతో దిశా నిర్దేశం చేశారు. ఇన్ని సంవత్సరాల తరువాత తమను గుర్తు పెట్టుకొని ఆహ్వానం పలికి చక్కని కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ వారి వారి గురువులను శాలువ, పూల మాలలతో ఆత్మీయ సత్కారం గావించి మన బాల్యం జ్ఞాపికను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా గురు శిష్యులు పరస్పరం భావోద్వేగానికి గురి అవడం విశేషం. ఈ కార్యక్రమంలో నాటి గురువులైన గుద్దేటి కోటయ్య, ప్రభుదాస్, సైమన్ విక్టర్, కే. జె. భాస్కర్, సామ్రాజ్యమ్మ, రెడ్డి నారాయణ రెడ్డి, పిడతల సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, మురళీ కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, బాల సుందరం, భాస్కర్ నాయుడు, సత్యానందం, ఆకవీటి సుబ్రహ్మణ్యం,హైమావతి, డోరతి, తదితరులు పాల్గొనడం జరిగింది. అనంతరం విందు భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాగి చివరకు చిన్న నాటి స్నేహితులందరూ పరస్పర ఆలింగనాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సమాయత్తం

### - పోటీకి ఆసక్తి ఉన్న జనసైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 19:**

కందుకూరు నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీని సమాయత్తం చేసే దిశగా నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కందుకూరు పట్టణంలోని న్యూ వుడ్‌ల్యాండ్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్తలు మానేపల్లి వెంకట బుచ్చయ్య గుప్తా, దేవళ్ల భాస్కరరావు హాజరుకాగా, కమిటీ నిర్వాహక దళ సభ్యులు, సపోర్ట్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎజెండాపై చర్చించడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏయే ప్రాంతాల్లో అభ్యర్థులను బరిలోకి దించాలి, పార్టీని క్షేత్రస్థాయిలో ఎలా బలోపేతం చేయాలనే అంశాలపై సమాలోచనలు జరిపారు.

**ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న జనసైనికులు తమ దరఖాస్తులను కమిటీకి సమర్పించాలని ఈ సందర్భంగా సూచించారు. పార్టీ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా తదుపరి కార్యాచరణను రూపొందించి ముందుకు సాగుతామని కమిటీ సభ్యులు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని, అర్హులైన ఆశావహులు ముందుకు వచ్చి దరఖాస్తులు సమర్పించాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## విజయదశమి శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 19**

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో నూతన ఆశలు, ఆనందాలు, విజయాలు నింపాలని మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు ఆకాంక్షించారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.జగన్మాత దుర్గాదేవి కృపాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతన్నల కష్టానికి తగిన ఫలితం దక్కాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ప్రార్థించారు.

# భైరవకోనలో భక్తుల సందడి

### ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన త్రిముఖ దుర్గాదేవి

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 19**



జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని దుర్గాదేవి రూపంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. అర్చకులు పునర్నవమి, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అమ్మవారికి కుంకుమార్చన, బిల్వార్చన పూజలు చేసి హోమాలు నిర్వహించారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో భైరవకోనకు తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రాకతో భైరవకోన ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తల్లిదండ్రులు ముక్కు నరసారెడ్డి ధర్మపత్ని రత్తమ్మ, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు దంపతులు, పవన్ కుమార్ రాజు, ఎం శ్రీనివాసరాజు దంపతులు, అంబవరం మాజీ సర్పంచ్ గుంటిమడుగు వెంకట రామరాజు కుటుంబ సభ్యులు, రుద్రరాజు రాజేంద్ర, ముప్పాళ్ళ విక్రం రాజు దంపతులు, ముప్పాళ్ళ రాజేంద్ర, ఆలయ మాజీ చైర్మన్ సిద్దు రమణారెడ్డి దంపతులు, మాజీ జెడ్పిటిసి కమ్మనేతి సుబ్బమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు కంబాలదిన్నె వెంకట నరసయ్య, అర్చకులు సుధాకర్ శర్మ, రామ్మూర్తి, కిషోర్, మహేష్ రెడ్డి, శ్రీ త్రిపుర భైరవేశ్వర నంద స్వామిజి, ఉభయకర్తలు భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సి ఎస్ పురంలో జనసేన పార్టీ సమీక్ష

### ఎంపీటీసీ అభ్యర్థులను ప్రకటించిన జనసేన పార్టీ స్థానిక సంస్థల కమిటీ



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 19**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో సోమవారం ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు మండల జనసేన పార్టీ స్థానిక సంస్థల కమిటీ ప్రకటించింది.సి ఎస్ పురం-1 ఎంపీటీసీ అభ్యర్థిగా సంగిశెట్టి చిన్న కొండమ్మ, సీఎస్పురం-2 అభ్యర్థిగా తోట నారాయణ, కోవిలంపాడు అభ్యర్థిగా గూడంశెట్టి రవికుమార్, రేగులచెలక అభ్యర్థిగా గోపతి రత్తమ్మ, చెన్నపునాయునిపల్లి అభ్యర్థిగా సమ్మన తిరుపతి, దర్శిగుంటపేట అభ్యర్థిగా సంకతాల సుబ్బయ్యను ఎంపిక చేసినట్లు కమిటీ తెలిపింది.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆరు మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ప్రజాసేవ పట్ల ఆసక్తి, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండే నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

# మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**వలేటివారిపాలెం, పెన్ పవర్, అక్టోబర్ 20:**



వలేటివారిపాలెం మండల ప్రజలందరికీ నెల్లూరు జిల్లా వైకాపా రైతు విభాగం వైస్ ప్రెసిడెంట్ కట్టా హనుమంతరావు విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, అసత్యంపై సత్యం, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ ప్రాధాన్యత ఎంతో గొప్పదని అన్నారు. ఆ తల్లి దుర్గమ్మ ఆశీస్సులతో మండల ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా అన్నదాతలైన రైతులకు ఈ దసరా పండుగ మరింత సంతోషాన్ని తీసుకురావాలని కోరారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, రైతులందరూ అష్టైశ్వర్యాలతో తులతూగాలని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని ఆ దుర్గమ్మ తల్లిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలంతా ఐక్యంగా, సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని, ఈ విజయదశమి వారికి కొత్త విజయాలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.

# మొగిలిచర్లలో టీడీపీ నుంచి వైసీపీలోకి చేరికలు

## -ప్రజాసేవకు ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ పార్టీలో ఆహ్వానం

## -వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 19:**

కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వైసీపీ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చడంతో పాటు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చి, నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వానికి మద్దతుగా పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. సొసైటీ సభ్యుడు బండి రమణారెడ్డి ఆధ్వర్యంలో మొగిలిచర్ల గ్రామానికి చెందిన పలువురు బుర్రా మధుసూదన్ యాదవ్ సమక్షంలో వైసీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ ఆహ్వానం ఉంటుందని అన్నారు. పార్టీ తల్లిలాంటిదని, ప్రజాసేవలో భాగస్వాములయ్యే వారికి తగిన అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేందుకు కృషి చేయాలని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.

**వైసీపీలో చేరిన వారిలో..**

మొగిలిచర్ల గ్రామానికి చెందిన బండి రాజమ్మ, బండి కిషోర్‌రెడ్డి, భీమవరపు సిసింద్రీ, పల్లాల రఘురామిరెడ్డి, వేముల మాలకొండయ్య, వేముల మార్కండేయులు, బాసం కొండలరావు, గోరంట్ల రాజేష్, స్వర్ణ రవి, ఇంద్రకంటి యెహోవా, స్వర్ణ ఆమోస్, లేటి నాగేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు వైసీపీ కోసం సమష్టిగా పనిచేస్తామని తెలిపారు.

# పొదిలిలో గుండెపోటుతో మహిళా కండక్టర్ మృతి



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 19**

పొదిలిలో ఒక మహిళా కండక్టర్ గుండెపోటుతో మరణించిన సంఘటన జరిగింది. ఈ విషాదకరమైన సంఘటన సోమవారం నాడు స్థానిక డిపో ఆవరణలో జరిగింది. పొదిలి డిపోలో కండక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న నాగమల్లేశ్వరి అనే మహిళ విధి నిర్వహణలో ఉంటూ, డిపో ఆవరణలో గల సెల్ పాయింట్ వద్ద తన సెల్ ను రీఛార్జ్ చేసుకునేందుకు వెళ్లి, గుండెపోటుతో అక్కడే కుప్పకూలిపోయింది. సిబ్బంది ఆమెను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుని వెళ్ళగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనతో స్థానిక ఆర్టీసీ డిపోలో విషాద వాతావరణం చోటుచేసుకుంది.

# స్థానిక ఎన్నికల్లో జనసేన విజయమే లక్ష్యం: గణిమిశెట్టి నరహరి కృష్ణ

## అద్దంకిలో ఎన్నికల నిర్వహణ కమిటీ ఆత్మీయ సమావేశం



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) అక్టోబర్ 19:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో, ఐక్యంగా పనిచేయాలని ఆ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త గణిమిశెట్టి. నరహరి కృష్ణ పిలుపునిచ్చారు. అద్దంకి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా సంతమాగులూరు మండలంలోని పార్టీ బలాబలాలపై లోతుగా చర్చించారు. ఆ మండలంలో జనసేన పార్టీ పటిష్టంగా ఉన్న గ్రామాల నుంచి రాబోయే ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహ అభ్యర్థుల ప్రాథమిక జాబితాను స్థానిక నాయకులు పార్టీ నాయకత్వానికి సమర్పించారు. గ్రామాల్లో గెలుపు అవకాశాలు, పార్టీ వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కమిటీ సభ్యులతో సమగ్రంగా సమీక్షించారు.

**ఐక్యంగా కదం తొక్కాలి..**

నరహరి కృష్ణ మాట్లాడుతూ.. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ఎన్నికల్లో విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండలానికి చెందిన జనసైనికులు, వీర మహిళలు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిద్దలూరు చైర్మన్ పదవికి 17 నామినేషన్లు,28 వార్డుల కౌన్సిలర్ పదవులకు 123 నామినేషన్లు చెల్లుబాటు

**గిద్దలూరు,పెన్ పవర్ అక్టోబర్ 19**

పురపాలక ఎన్నికల్లో ఆదివారం నాటికి నామినేషన్ల ప్రక్రియ ముగియగా సోమవారం అధికారులు నామినేషన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు.

**పరిశీలన అనంతరం**

నిబంధనల ప్రకారం చైర్మన్ పదవికి 17నామినేషన్లు, మొత్తం 28 వార్డులకు కౌన్సిలర్ పదవులకు123 నామినేషన్లు చెల్లుబాటు అయినట్లుగా ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కమీషనర్ ఇ.వి రమణ బాబు ప్రకటించారు. చైర్మన్ పదవికి భారతీయ జనతాపార్టీ తరపున నాలుగు ,టిడిపి తరపున ఒకటి, వైసీపీ తరపున మూడు, బి.సి.వై తరపున ఒకటి, స్వతంత్రులుగా ఎనిమిది మంది నామినేషన్లు చెల్లుబాటులో ఉన్నట్లుగా తేల్చారు. చైర్మన్ పదవికి చెల్లుబాటు అయిన నామినేషన్లలో భూమా బాల నరసింహారెడ్డి, అడపాల నాగమణి,కమలపాటి వెంకట చంద్ర మోహన్,పోలంరెడ్డి బాలకృష్ణారెడ్డి,నేలటూరి శ్రీ మిత్ర,జాడి వెంకట నారాయణ,దూదేకుల నాయబ్,పాలుగుళ్ళ శివసాయి ప్రతాప రెడ్డి,ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి,పిడతల వెంకట రమేష్ కుమార్ రెడ్డి,పిడతల సరస్వతి, పాలుగుళ్ళ సాయి కిరణ్ రెడ్డి కి చెందిన నామినేషన్లు చెల్లుబాటు లో ఉన్నాయి. 28 వార్డులకు సంబంధించి బీఎస్పీ రెండు, బిజెపి రెండు, సిపిఎం ఒకటి, టిడిపి 42,వైసిపి 54, జనసేన 9, స్వతంత్ర అభ్యర్థులుగా 13 నామినేషన్లు



చెల్లుబాటు అయ్యాయి.

**ఉప సంహరణల గడువు 21:**

చెల్లుబాటైన నామినేషన్లలో అభ్యర్థులు తమ నామినేషన్ ను ఉప సంహరించుకునేందుకు వీలుగా 21 వ తేదీ గడువుగా ప్రకటించారు.

# ప్రకాశం జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

## – ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 19**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ప్రజలందరికీ దామచర్ల జనార్దన్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అసత్యంపై సత్యం, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో ఎలినో ప్రభావం లేకుండా వర్షాలు బాగా పడి, అన్నదాతల ఇంట సిరులు పండాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

## ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. బాలు నాయక్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 19**

స్థానికంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పారదర్శకంగా ప్రణాళిక బద్ధంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి బాలు నాయక్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహించనున్న అధికారులకు,గ్రామ పంచాయతీ సెక్రటరీలకు పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.అభ్యర్థులు నామినేషన్ దాఖల సమయంలో కూడా ఎక్కడ కూడా అవాంతరాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 21 న ఉదయం 9.గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నోటీసు జారీ చేయడం జరుగుతుందని,23వ తేదీ సాయంత్రం 5.గంటల వరకు జెడ్పీటిసి,ఎంపీటీసీ ఎన్నికలకు అభ్యర్థుల నుండి నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నట్లు తెలిపారు.అలాగే 24వ తేదీ వేసిన నామినేషన్లు పరిశీలన,25న తిరస్కరించిన నామినేషన్లపై ఎంపిటిసిలకైతే ఆర్డీవో వద్ద,జెడ్పీటిసికైతే జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకుని అవకాశం ఉందని తెలిపారు.26న అప్పిలేట్ అధికారచే అప్పీల్ పై తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.27న అభ్యర్థుల నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉందని,అదే రోజు ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రచురించటం జరుగుతుందని తెలిపారు.నవంబర్ 3వ తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5.గంటల వరకు మండలంలో 63 పోలింగ్ కేంద్రాలలో ఓట్ల నిర్వహణ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.రీపోలింగ్ అవసరమైతే 4వ తేదీ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.5వ తేదీ ఓట్ల లెక్కింపు,అదే రోజు ఫలితాలు కూడా వెల్లడించనున్నట్లు తెలిపారు.ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ నాయకులు,ఓటర్లు ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి శ్రీనివాసులు,తహసీల్దార్ ఎన్ జయలక్ష్మి,ఎస్సై ఎం దేవ కుమార్,ఏంఈఓలు పి ఆంజనేయులు,ఎస్ మల్లు నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన బద్దెల



**పీసీపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 20**

విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పీసీ పల్లి మండల ప్రజలందరికీ వైకాపా పార్టీ నాయకులు బద్దెల లక్ష్మణ్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ అసత్యంపై సత్యం, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ ప్రాధాన్యత ఎంతో గొప్పదని లక్ష్మణ్ రెడ్డి అన్నారు. ఆ తల్లి దుర్గమ్మ ఆశీస్సులతో మండల ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా అన్నదాతలైన రైతులకు ఈ దసరా పండుగ మరింత సంతోషాన్ని తీసుకురావాలని కోరారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండి, రైతులందరూ అష్టైశ్వర్యాలతో తులతూగాలని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని ఆ దుర్గమ్మ తల్లిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలంతా ఐక్యంగా, సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని, ఈ విజయదశమి వారికి కొత్త విజయాలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.

# పేస్.. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలలో ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు

## – స్ట్రాంగ్ రూములు కూడా ఇక్కడే – జిల్లా కలెక్టర్ రాజబాబు నిర్ణయం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 19**

ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సెంటర్లను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రాజాబాబు నిర్ణయించారు. ఒంగోలు నగర శివారులోని పేస్, క్విజ్ ఇంజనీరింగ్ కాలేజీలలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కౌంటింగ్ కేంద్రాల విషయంలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని జిల్లాల కలెక్టర్లకు ఇస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేయడంతో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి ఈ కాలేజీలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. స్ట్రాంగ్ రూములను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. అన్ని మండలాలకు సంబంధించిన ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల బ్యాలెట్ బాక్స్ లను ఈ కాలేజీలలో భద్రపరుస్తారు. వీటికి సంబంధించిన కేటాయింపు, ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా వారి వెంట జడ్పి



సీఈవో చిరంజీవి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఇతర అధికారులు ఉన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## ఎస్పీ పంకజ్ కుమార్ మీనా హెచ్చరిక



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 19**

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సూచించారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణ కోసం 144 సెక్షన్ తో పాటు పోలీస్ యాక్ట్ లోని సెక్షన్ 30 నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# 21 నుంచి ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం

## అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ నెల 21 నుంచి 23 వరకు దాఖలు చేసుకోవచ్చు.

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలి.

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 19**

కొమరోలు మండలంలోని ఎంపీటీసీ స్థానాలతోపాటు జడ్పీటిసి స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థుల నుంచి ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని కొమరోలు మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ కొమరోలు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంగ ఆశాజ్యోతి తెలిపారు. కొమరోలు మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు అధ్యక్షత వహించగా, మండల పరిషత్ స్పెషల్ అధికారి, కొమరోలు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంగా ఆశాజ్యోతి, కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు ముఖ్య అధికారులుగా హాజరయ్యారు ఆ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఆశాజ్యోతి కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు ఒక జడ్పీటిసి స్థానానికి నవంబర్ మూడో తేదీన పోలింగ్ నిర్వహిస్తారని, ఆ మేరకు ఈనెల 19 తేదీ ఉదయం 9 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామని ఆమె తెలిపారు. ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ నామినేషన్లను మండల పరిషత్ కార్యాలయంలోని ఎన్నికల అధికారులకు దాఖలు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.ఆ మూడు రోజులపాటు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. జడ్పీటిసి స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు జిల్లా కేంద్రమైన మార్కాపురం కు వెళ్లి అక్కడ నామినేషన్లు దాఖలు చేయాలని ఆమె సూచించారు..ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేసే ఓసి అభ్యర్థులు నామినేషన్ ఫారాలను సంపూర్తిగా పూర్తిచేసి అవసరమైన



సర్టిఫికెట్లతోపాటు 3000 రూపాయలు ధరావతు చెల్లించాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ బీసీ కులాలకు చెందిన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం సమర్పిస్తూ 1500 రూపాయలు ధరావతు చెల్లించాలని ఆమె తెలిపారు. అన్ రిజర్వుడ్ స్థానాలలో పోటీ చేసే ఎస్టీ, ఎస్టీ బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించని ఎడల 3000 రూపాయలు ధరావతు చెల్లించ వలసి ఉంటుందని ఆమె వివరించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రంతోపాటు నో డ్యూ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, నోటరీ తో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించవలసి ఉంటుందని ఆమె వివరించారు.ఎంపీటీసీ స్థానాలు పోటీ చేసే అభ్యర్థులు నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు చేయవచ్చని, జెడ్పిటిసి స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు 8 లక్షల రూపాయల వరకు ఖర్చు చూపించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలని, అందుకు తగిన ఆధారాలను సమర్పించాలని ఆమె తెలిపారు. నామినేషన్ లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు ప్రతిపాదించే వారు ఇద్దరు మాత్రమే అభ్యర్థి వెంట రావాల్సి ఉంటుందని, అంతకుమించి ఎవరిని నామినేషన్ల దాఖలు కేంద్రంలోనికి అనుమతించరని ఆమె చెప్పారు.అందిన నామినేషన్ల స్క్రూటని ఈనెల 24వ తేదీ న ఉంటుందని, అందులో తిరస్కరణకు గురైన నామినేషన్లు అన్యాయమని భావించే అభ్యర్థులు 25వ తేదీన ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని,26వ తేదీన ఆర్డిఓ అప్పిళ్లపై తుది తీర్పు వెల్లడిస్తారని ఆమె పేర్కొన్నారు. 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉన్నదని ఆమె తెలిపారు. పోలింగ్ నవంబర్ మూడో తేదీన నిర్వహించి, 5వ తేదీన కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారని. రీపోలింగ్ అవసరమైన చోట్ల నవంబర్ 4వ తేదీన రీపోలింగ్ నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు, జడ్పిటిసి స్థానానికి జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ప్రతినిధులుగా కొమరోలు మాజీ జెడ్పిటి సభ్యులు సారే వెంకట నాయుడు కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్ కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుళ్ళ వెంకటరమణారెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధిగా అవిశినేని గురువయ్య, సిపిఎం పార్టీ ప్రతినిధులుగా పోసాని అంజమ్మ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి

### – జిల్లా కలెక్టర్ రాజాబాబు – మీడియా సెంటర్ ..

### కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 19**

సోమవారం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని, మీడియా సెంటర్లను పరిశీలించారు. మీడియా సెంటర్, కమాండ్ కంట్రోల్ రూము సిబ్బందితో మాట్లాడి ఎప్పటికప్పుడు విషయాలు సేకరించి నమోదు చేయాలన్నారు. రిజిస్టర్లను పరిశీలించి నమోదు ప్రక్రియను సక్రమంగా చేయాలని ఆయన సూచించారు. అప్రమత్తతో విధి లు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. మీడియా సెంటర్ అన్ని వసతులు ఉండేటట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

## పొదిలి మండల జెడ్పిటిసి బరిలో శ్రీనివాసులు



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 19**

పొదిలి మండలం జడ్పిటిసి గా మద్దుల శ్రీనివాసులు పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. వీరి శెట్టి విద్యాసంస్థల అధినేతగా శ్రీనివాసులకు మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల జడ్పిటిసి బరిలో జనసేన పార్టీ అభ్యర్థిగా ఆయన రంగంలోకి దిగనున్నట్లు సమాచారం.

## నారాయణస్వామి ఆదాయం రూ.3,02,864/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 19**

జిల్లాలో ప్రసిద్దిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.3,02,864/-లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ.1,15,470/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ .22,600/- లు, అన్నదానం విరాళములు ద్వారా ఆదాయం రూ.1,49,046/- లు, ఇతర విరాళంల ద్వారా ఆదాయం రూ.15,748/- లు వచ్చినట్లు తెలిపారు తెలిపారు శాశ్వత అన్నదాన పథకమునకు విరాళములు ఇచ్చినవారు మండలం లోని కృష్ణంనాయునిపల్లి గ్రామ వాస్తవ్యులు కాటసాని రవి కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం రామసుబ్బారెడ్డి ధర్మపత్ని మహా లక్ష్మమ్మ రూ.75,000/-లు అందజేసినట్లు తెలిపారు.

## నామినేషన్ల డాక్యుమెంట్లు చించివేత అంటూ కాసేపు హైరానా..



**గిద్దలూరు, పెన్ పవర్ అక్టోబర్ 19**

గిద్దలూరు పురపాలక సంఘం ఎన్నికల నామినేషన్ల పరిశీలన సందర్భంలో నామినేషన్ల డాక్యుమెంట్లు చించివేతకు గురయ్యాయంటూ బిజెపి మార్కాపురం జిల్లా అధ్యక్షులు కృష్ణారావు ఆరోపిస్తూ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిని నిలదీశారు. వైసీపీ వారు గెలవలేక ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. బిజెపి అభ్యర్థితో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కాసేపు నిరసన ప్రకటించారు. చైర్మన్ పదవికి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన చేసిన ఎన్నికల అధికారి బదులిస్తూ.. బిజెపి జై అంటూ డాక్టర్ జెవి నారాయణ గెలవాలంటూ నినదిస్తూ పేపర్లు చించారని చెప్పారు. ఇవన్నీ కాసేపు సోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. దీనిపై ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఇ.వి రమణ బాబు మాట్లాడుతూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరిశీలన కార్యక్రమం జరిగిందని,అన్ని నామినేషన్ల డాక్యుమెంట్లు అందుబాటులోనే ఉన్నాయని చెల్లుబాటైన నామినేషన్ల జాబితా వెల్లడించడంతో సమస్య సద్దుమణిగింది.

# చంద్రవతిని గెలిపించండి

## 40వ వార్డు ప్రచారంలో కందుల వసంత లక్ష్మి



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 19**

మార్కాపురం పురపాలక సంఘం 40వ వార్డులో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి 40వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఏరువా చంద్రవతితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా వార్డులోని మహిళలు, యువకులు, పెద్దలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసంత లక్ష్మి మాట్లాడుతూ ఈ 40వ వార్డు అంటే మాకు చాలా అభిమానం. ఇక్కడ ప్రజలంతా ఎంతో చైతన్యంగా ఉంటారు. ఈసారి మన వార్డు నుండి ఏరువా చంద్రవతి కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నారు. ఆమె చిన్నప్పటి నుంచే సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా స్వయంగా వెళ్లి ఆదుకునే మంచి మనసున్న వ్యక్తి అని వార్డు ప్రజలకు తెలియజేశారు. గతంలో వార్డులో జరిగిన అభివృద్ధి అంతా ఇంతా కాదు. మన ఎమ్మెల్యే కందుల నాయకత్వంలో మార్కాపురం ముఖచిత్రమే మారిపోయింది. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి లైట్లు ఇలా ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని చెప్పారు. చంద్రవతి గెలిస్తే మీ అందరి గొంతుకై, మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందేలా చూస్తారని అన్నారు. కాబట్టి ప్రజలందరూ ఆలోచించి ఓటు వేయాలనీ,సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఏరువా చంద్రవతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాననీ తెలిపారు. మీరు ఇచ్చే ప్రతి ఓటు మార్కాపురం అభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తి రసాన్ని పంచిన వినోద్ కుమార్ గాత్రకచేరి

### -నేత్రపర్వంగా శ్రీవారి ఊంజల సేవ



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 19**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీవారి ఊంజల సేవ కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీ గిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ ఆలపించిన అన్నమయ్య భక్తి సంకీర్తనలు భక్తులను విశేషంగా అలరించాయి. భక్తి రసామృతాన్ని పంచాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్యనిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు కార్యక్రమంలో పాల్గొని గాయకులు వినోద్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీవారికి తిరువీధి ఉత్సవం అత్తిన బాల కోటేశ్వరరావు బృందం చే కోలాట ప్రదర్శన జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# ధర్మ విజయానికి ప్రత్యేక దసరా పండుగ

## జమ్మి ఆకులను బంగారంగా భావించి పంచుకునే సంప్రదాయం

## పాలపిట్ట దర్శనం ... విజయానికి శుభసంకేతం

**సి.ఎస్.పురం, పెన్ పవర్ అక్టోబర్ 19**

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. దసరా పండుగకు ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో విశిష్టత ఉంది. ఈ పర్వదినం సందర్భంగా అమ్మవారిని ఆరాధిస్తారు పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించిన రోజుగా విజయదశమికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తుల నుంచి లోకాన్ని కాపాడిన సందర్భాన్ని ఈ పండుగ గుర్తుచేస్తుంది. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసం ముగిసిన అనంతరం జమ్మి చెట్టుపై దాచిన తమ ఆయుధాలను తిరిగి పొందినట్లు పురాణ కథనం. ఈ సంఘటన విజయదశమి పండుగ ప్రాధాన్యతను తెలియజేస్తుంది.దసరా రోజున జమ్మి చెట్టును పూజించడం శుభప్రదంగా భావిస్తారు. జమ్మి ఆకులను బంగారానికి ప్రతీకగా భావించి బంధుమిత్రులు, స్నేహితులు, పెద్దలకు పంచుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. రైతులు వ్యవసాయ పనిముట్లను, వ్యాపారులు తమ పరికరాలకు, వాహనాలకు పూజలు నిర్వహిస్తారు ప్రజలు తమ వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెందాలని, చేపట్టే పనుల్లో విజయాలు సాధించాలని దసరా పండుగ సందర్భంగా వేడుకుంటారు పాలపిట్టను దర్శనం శుభప్రదమని ప్రజలు



భావిస్తారు విజయదశమి పండుగ ప్రజల్లో కొత్త ఆశలను నూతన ఉత్సాహాన్ని నింపుతూ చెడులు విడనాడి మంచిని ఆచరించాలని ధర్మ మార్గంలో నడవాలని సందేశం ఇస్తూ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు సుఖసంతోషాలు అభివృద్ధి కలగాలని ఆకలి చేస్తూ ఒక చోట చేరి ఆనందంగా సంతోషంగా పండుకొను జరుపుకుంటూ పరస్పరం శు భాకాంక్షలు తెలుపుకుంటూ ఘనంగా జరుపుకుంటారు.

## మండల పరిషత్ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన పోలీసులు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 19**

మార్కాపురం మండల పరిధిలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు మండల పరిషత్ కార్యాలయాన్ని కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు సోమవారం కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రం వద్ద బారికేడ్ల ఏర్పాటు, సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ పికెట్ నిర్వహణపై ఆరా తీశారు. అభ్యర్థులతో పాటు పరిమిత సంఖ్యలోనే అనుచరులను అనుమతించాలని, గుంపులుగా రాకుండా చూడాలని సూచించారు. మార్కాపురం కొత్త జిల్లా కేంద్రం కావడంతో నామినేషన్లకు పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

## ఎన్నికల వ్యయం నియమ నిబంధనలపై జిల్లా ఎన్నికల పరిశీలకులు హెప్సిబా రాణి సమీక్ష సమావేశం





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 19**

జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎన్నికల వ్యయానికి సంబంధించి అభ్యర్థులు పాటించవలసిన నియమ నిబంధనలు, అధికారులు తీసుకోవలసిన చర్యలపై ఒంగోలు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు హెప్సిబా రాణి, ఎన్నికల వ్యయ పరిశీలకులు ఐ.ఎఫ్.ఎస్. పి. వివేక్ పాల్గొన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలకు నియమించబడిన సహాయ ఎన్నికల పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్స్, ఎఫ్ఎస్టి,ఎస్ఎస్టి, వివిఎస్టి టీమ్స్, జిల్లా ఎన్నికల వ్యయ మానిటరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు బ్యాంక్ ట్రాన్సాక్షన్స్, యుపిఐ ట్రాన్సాక్షన్స్ పై ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకుని నిశితంగా మానిటర్ చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్, ఇఇఎం నోడల్ ఆఫీసర్ తిరుపతయ్య లను ఆదేశించారు. ఈ సమావేశానికి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, ఇతర మున్సిపాలిటీల అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్స్, అకౌంటింగ్ టీమ్స్, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, నోడల్ అధికారులు హాజరయ్యారు.

# 19 తేదీ నుంచి కొమరోలు మండలంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలు

## పోలీసుల అనుమతి లేనిదే డీజేలు, మైకులు, ర్యాలీలు, బహిరంగ సభలు ఏర్పాటు చేయరాదు

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలి

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 19**

కొమరోలు మండలంలోని12 ఎంపిటీసీ స్థానాలతోపాటు జడ్పిటిసి స్థానానికి నిర్వహించనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 19 తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసింతవరకు కొమరోలు మండలంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉంటుందని కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు తెలిపారు. కొమరోలు మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు అధ్యక్షత వహించగా, మండల పరిషత్ స్పెషల్ అధికారి, కొమరోలు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంగా ఆశాజ్యోతి, కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు ముఖ్య అధికారులుగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎస్సై నాగేంద్రరావు మాట్లాడుతూ ఎంపిటిసి స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికలను పురస్కరించుకొని ఈనెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారని అందువల్ల సోమవారం నుంచి ఎన్నికలు ముగిసేంతవరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని అంతేగాక పోలీసు 30 యాక్ట్ కూడా అమలులో ఉంటుందని అందువల్ల ప్రజలు గుంపులు గుంపులుగా సంచరించరాదని ఆయన తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా మైకులు డీజేలు వినియోగించరాదని, ర్యాలీలు సభలు నిర్వహించుకునేవారు ముందస్తుగా పోలీసు అనుమతులు పొందాలని ఆయన వివరించారు. నామినేషన్లు దాఖలు చేసే కేంద్రానికి వంద మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు ఉంటాయని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు



మాత్రమే నామినేషన్ కేంద్రానికి వెళ్లవలసి ఉంటుందని. అభ్యర్థుల వాహనాలు కూడా పోలీసులు సూచించిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఓటర్లను బెదిరించటం,ప్రభావితం చేయటం చేయరాదని, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు అందరు సహకరించాలని ఆయన కోరారు. పోలీస్ స్టేషన్లో అభ్యర్థులపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు అని ఇచ్చే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు కొరకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి మరుసటి రోజు అభ్యర్థులకు అందజేస్తామని ఎస్సై తెలిపారు. తాను ప్రతిరోజు పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉంటానని అందువల్ల నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ల కొరకు అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు.అయితే దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్కు వచ్చి వెళ్ల వలసి ఉంటుందని ఆయన కోరారు. పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందని తనతో పాటు పలువురు పోలీసుఅధికారులు కూడా పర్యవేస్తుంటుంటారని ఆయన తెలిపారు. ఓటర్లకు స్లిప్పులు రాసి ఇచ్చే వ్యక్తులు పోలింగ్ స్టేషన్కు వంద మీటర్ల దూరంలో ఉండాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రాలలో ఒక పార్టీ తరపున ఒక ఏజెంట్ మాత్రమే కూర్చోవాలని, రిలీఫ్ ఏజెంట్, ఏజెంట్ ఒకే సమయంలో పోలింగ్ కేంద్రంలో కూర్చో రాదని, ఏజెంట్లు మద్యం సేవించి పోలింగ్ కేంద్రాల్లోనికి రావద్దని, పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు ప్రచారం చేయటం పార్టీలకు గుర్తులు చూపెట్టడం నిషేధమని ఆయన తెలిపారు.. మండలంలోని 12 ఎంపీటీసీల స్థానాలలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు రాజకీయ నాయకులు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని అందుకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ప్రతినిధులుగా కొమరోలు మాజీ జెడ్పిటి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుళ్ళ వెంకటరమణారెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధిగా అవిశినేని గురువయ్య, సిపిఎం పార్టీ ప్రతినిధులుగా పోసాని అంజమ్మ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యం: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి. గన్నవరం, పెన్ పవర్ అక్టోబర్ 19**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, జనసేన పార్టీ అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్త గిడ్డి సత్యనారాయణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. త్వరలోనే కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి, సీట్ల సర్దుబాటుపై చర్చించిన అనంతరం ఏ స్థానంలో ఎవరు పోటీ చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుని అభ్యర్థిత్వాలను ఖరారు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని,కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# శ్రీ మహిషాసుర మర్ధని అలంకారంతో పార్వతి దేవి అమ్మవారు

**-సువాసినులకు పసుపు కుంకుమ అందించిన శిద్దా లక్ష్మి పద్మావతి**

**- విశేష పూజలు నిర్వహించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు కుటుంబ సభ్యులు**



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 19**

దసరా శ్రీ దేవి నవరాత్రులు సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అమ్మవారి విశేష పూజా కార్యక్రమాలు తొమ్మిదవ రోజు సోమవారం నిత్య పూజలు అలంకారాలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శ్రీ మహిషాసుర మర్ధని తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు.శ్రీ దేవి శరన్నవరాత్రులు సందర్భంగా మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవిని, పార్వతి దేవి అమ్మవారిని శిద్దా రాఘవరావు దంపతులు విశేష పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. సోమవారం ఉదయం శ్రీ వాసవి అమ్మవారికి విశేష పూజలు,పంచామృత సుగంధ ద్రవ్యాలు అభిషేకాలు,శ్రీ చక్రార్చన, సాయంత్రం ఉభయదాతలతో వాసవి మహిళలచే సామూహిక లలితా సహస్ర నామ పారాయణం శ్రీ నగరేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేక పూజా కార్యక్రమం శ్రీ చక్రార్చన నవావరణ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం విజయ దశమి సందర్భంగా ఉదయం అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరి అలంకరణ, సాయంత్రం శ్రీ కన్యకా పరమేశ్వరి అలంకరణ, సాయంత్రం క్షేత్రంలో కొలువైవున్న ఉత్సవ మూర్తుల పార్వేట వేడుకలు, శమీపూజ,శమీ దర్శనం ఆలయ ధర్మ కర్తలు మాజీ మంత్రి డా.శిద్దా రాఘవ రావు, లక్ష్మి పద్మావతి వారి కుటుంబ సభ్యులుఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ అర్చకులు శ్రీమాన్ వెంకట హరి కుమారా చార్యులు భక్తులను కోరారు.ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా శ్రీనివాసరావు,లలిత దంపతులు శిద్దా సాయి బాబా దంపతులు,కొణిజేటి సువర్ణ,పల్లపోతు పద్మ, గాదం శెట్టి లక్ష్మి,చలువాది మాధవి,కూరపాటి ధనలక్ష్మి, దాట్ల సువర్చల మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ,హరి కృష్ణ శర్మ,కృష్ణ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

# నామినేషన్ల డాక్యుమెంట్లు చించివేత అంటూ కాసేపు హైరానా..

**గిద్దలూరు, పెన్ పవర్ అక్టోబర్ 19**

గిద్దలూరు పురపాలక సంఘం ఎన్నికల నామినేషన్ల పరిశీలన సందర్భంలో నామినేషన్ల డాక్యుమెంట్లు చించివేతకు గురయ్యాయంటూ బిజెపి మార్కాపురం జిల్లా అధ్యక్షులు కృష్ణారావు ఆరోపిస్తూ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారిని నిలదీశారు. వైసీపీ వారు గెలవలేక ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. బిజెపి అభ్యర్థితో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కాసేపు నిరసన ప్రకటించారు. చైర్మన్ పదవికి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన చేసిన ఎన్నికల అధికారి బదులిస్తూ.. బిజెపి జై అంటూ డాక్టర్ జెవి నారాయణ గెలవాలంటూ నినదిస్తూ పేపర్లు చించారని చెప్పారు. ఇవన్నీ కాసేపు సోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. దీనిపై ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఇ.వి రమణ బాబు మాట్లాడుతూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరిశీలన కార్యక్రమం జరిగిందని,అన్ని నామినేషన్ల డాక్యుమెంట్లు అందుబాటులోనే ఉన్నాయని చెల్లుబాటైన నామినేషన్ల జాబితా వెల్లడించడంతో సమస్య సద్దుమనిగింది.

# మార్కాపురం జిల్లాలో సైలెంట్ రెవల్యూషన్

**నామినేషన్ల వేళ దమ్ము చూపిన ఎస్పీ పంకజ్ కుమార్ మీనా**

**బాధ్యతలు చేపట్టిన కొంత కాలంలోనే శాంతిభద్రతలపై తనదైన ముద్ర**

**జిల్లా వ్యాప్తంగా సూపర్ ఎస్పీ అంటూ అభినందనలు**

**మార్కాపురం( జిల్లా స్టాఫ్ రిపోర్టర్)అక్టోబర్ 19**

కొత్త జిల్లా మార్కాపురం, కొత్త ఎస్పీ పంకజ్ కుమార్ మీనా వచ్చీ రాగానే తొలి సవాల్ మున్సిపాలిటీనామినేషన్లు. అందరూ గొడవలు, ఘర్షణలు జరుగుతాయని ఎదురుచూస్తే, జిల్లా మొత్తం సైలెంట్. ఒక్క గొడవ లేదు, ఒక్క కేసు లేదు. దీని వెనుక ఉంది ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సైలెంట్ ప్లానింగ్, సాలిడ్ ఎగ్జిక్యూషన్.

**వచ్చీ రాగానే హోంవర్క్ పక్కా - సమస్యాత్మక లిస్ట్ రెడీ..**

ఎస్పీగా ఛార్జ్ తీసుకున్న 24 గంటల్లోనే జిల్లా మొత్తం మ్యాప్ ను స్టడీ చేశారు. ఏ మండలం సున్నితం, ఏ మున్సిపల్ వార్డులో గతంలో గొడవలు జరిగాయి, ఏ గ్రామంలో ఫ్యాక్షన్ ఉంది అనే పూర్తి డేటా తెప్పించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులను స్టేషన్ కు పిలిపించి బైండోవర్ చేశారు. అక్రమ మద్యం, డబ్బు, ఆయుధాలపై స్పెషల్ డ్రైవ్ పెట్టి అరకట్టారు. గొడవ జరగక ముందే గొడవకు కారణాలను కట్ చేయడమే ఆయన స్టైల్.

**నామినేషన్ కేంద్రాల వద్ద హైటెక్ బందోబస్తు, టెక్నాలజీతో నిఘా..**

పాతకాలం బందోబస్తు కాదు. ప్రతి మండల పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు, డ్రోన్ నిఘా, వీడియో రికార్డింగ్. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో ఒకరు లేదా ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతి. ర్యాలీలు, డప్పులు, గుంపులకు నో ఎంట్రీ. దీంతో నామినేషన్ కేంద్రాల వద్ద పండగ వాతావరణం కాకుండా ప్రశాంత వాతావరణం నెలకొంది. అభ్యర్థులు భయం లేకుండా వచ్చి నామినేషన్ వేసుకుని వెళ్లారు.

**ఏసీ రూమ్ ఎస్పీ కాదు, ఫీల్డ్ లో దిగిన బాస్..**

పంకజ్ కుమార్ మీనా స్టైలే వేరు. కార్యాలయంలో కూర్చుని ఆర్డర్లు వేసే టైపు కాదు. స్వయంగా జీప్ ఎక్కి అర్ధరాత్రి వరకు మండలాల్లో తిరుగుతున్నారు. చెక్ పోస్టుల్లో సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. సీఐలు, ఎస్ఐలకు ఎప్పటికప్పుడు టార్గెట్ ఇస్తున్నారు. ఎస్పీనే ఫీల్డ్ లో ఉంటే కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు అందరూ పరుగులు పెట్టక తప్పదు. అందుకే జిల్లా పోలీసు శాఖలో ఇప్పుడు కొత్త జోష్.

**యూత్ లో సూపర్ బాస్ క్రేజ్, రాజకీయాలకు అతీతంగా శాంతిభద్రతలకే ఫస్ట్ ప్రయారిటీ**

రాజకీయ నాయకుల మాట విని పనిచేసే పోలీసింగ్ కాదు, రాజ్యాంగం




ప్రకారం పనిచేసే పోలీసింగ్ అంటూ ఎస్పీ క్లియర్ కట్ గా చెప్పారట. ఏ పార్టీ అయినా రూల్ ఒక్కటే. దీంతో యువతలో ఆయనకు ఫుల్ క్రేజ్ వచ్చింది. సోషల్ మీడియాలో సూపర్ బాస్ ఎస్పీ అంటూ పోస్టులు పెడుతున్నారు. కొత్త జిల్లాలో తొలి ఎన్నికల నామినేషన్ల ఘట్టాన్ని ఎటువంటి మచ్చ లేకుండా, ప్రశాంతంగా నిర్వహించడం ద్వారా పంకజ్ కుమార్ మీనా తన సామర్థ్యం ఏంటో, తన మార్క్ ఏంటో చూపించారు. ఆయన లాంటి అధికారి మార్కాపురం జిల్లాకు దొరకడం మా అదృష్టమని జిల్లా ప్రజలు అంటున్నారు.

# ఎన్నికల వేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**సభలు, ర్యాలీలకు పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరి**



**అనకాపల్లి, పెన్ పవర్ అక్టోబర్ 19**

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అనకాపల్లి డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ పి.వి.వి. నరసింహారావు తెలిపారు. పోలీసుల ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

# సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

**- నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు**




**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 19**

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నగర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా అక్టోబర్ 28న జరగనున్న ఎన్నికల్లో నాలుగు డివిజన్ల నుంచి సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ప్రకటించారు. రాజకీయాలు కలుషితమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న తమ అభ్యర్థులను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.

**నాలుగు డివిజన్లలో పోటీ....**

సీపీఎం తరఫున 3వ డివిజన్ (బీసీ జనరల్) నుంచి కొక్కిలగడ్డ వంశీధర్, 45వ డివిజన్ (ఓసీ జనరల్) నుంచి సయ్యద్ హుస్సేన్, 51వ డివిజన్ (ఎస్సీ మహిళ) నుంచి పొత్తూరు లక్ష్మి, 59వ డివిజన్ నుంచి గంధవల్ల బాలకృష్ణ పోటీ చేస్తున్నట్లు తెలిపారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీల సమస్యలపై జరిగే పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ, విద్యార్థులు, యువజనులు, మహిళల ఆందోళనలకు మద్దతుగా నిలుస్తున్నామని వివరించారు. ఒంగోలు నగరంలో మంచినీటి సరఫరా, రోడ్లు, కాలువలు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు అందించాలని, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వచ్చే రాజకీయాలకు భిన్నంగా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ పనిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని చీకటి శ్రీనివాసరావు కోరారు.

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**-జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి**




**జిన్నారం మండలం పెన్ పవర్ అక్టోబర్ 19**

జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజలంతా సుఖశాంతులతో దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరికీ ఉంటాయని ఆయన అన్నారు విజయదశమి అంటే తెలుగు ప్రజలకు ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగని వారు అన్నారు ధనికులు పేదలు అనే భేదం లేకుండా అందరూ కలిసిమెలిసి చేసుకునే పండుగనే దసరా ఆడపడుచులు నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. అదేవిధంగా అమ్మవారి నవరాత్రులు భక్తిశ్రద్రతో తెలుగు ప్రజలందరూ ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ విజయదశ అని ఆయన అన్నారు ఈ పండుగ మన పురాణాల కాలం నుంచి అసలు పండుగ ఎలా వచ్చింది అసలు పండగ జరుపుకోవడానికి కారణాలు మన పూర్వీకులు పాండవుల వనవాసం నుంచి రాసిన గ్రంథం ప్రకారం ఈ దసరా ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది అని వారు తెలిపారు దసరా అంటే తెలుగు ప్రజలంతా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పండుగని ప్రతి ఒక్కరు నూతన వస్త్రాలు ధరించి అందరూ కలిసి చిన్న పెద్ద తేడా లేకుండా అలాయ్ బలై చేసుకుంటూ సంతోషంగా జరుపుకునే ముఖ్యమైన పండుగని వారు అన్నారు ఎల్లప్పుడూ ప్రజలంతా సుఖశాంతులతో ఆయు ఆరోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో వెలుగొందాలని విజయదశమి సందర్భంగా గ్రామ దేవత అయిన బతుకమ్మ తల్లిని దుర్గ మాతను వేడుకుంటున్నట్లు అదేవిధంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి సిటిజన్ పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలపడం జరిగింది.

పెన్ పవర్ మంగళవారం 20 అక్టోబర్ 2026

# 46 ఫోర్లు, 7 సిక్సులతో విధ్వంసం.. 400 రన్స్ కొట్టిన చిన్మయ్ సుతార్




భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన సంచలనం నమోదు అయింది. రంజీ ట్రోఫీ హిస్టరీలో దాదాపు 78 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మిజోరాం బ్యాటర్ చిన్మయ్ సుతార్ భారీ రికార్డును నెలకొల్పాడు. నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా 400ం పరుగులు సాధించి క్వాడ్రపుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఈ ఘనత సాధించడంతో రంజీ ట్రోఫీ చరిత్రలోనే 400 రన్స్ మైలురాయిని తాకిన రెండో బ్యాటర్‌గా చిన్మయ్ చరిత్ర సృష్టించాడు.

**9 వికెట్లు పడిపోయినా ఒంటరి పోరాటం:**

ముంబైలో జన్మించి ప్రస్తుతం మిజోరాం తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మైదానంలో చూపించిన పట్టుదల, పోరాటపటిమ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

ఒంటరి పోరాటం: తొలి ఇన్నింగ్స్‌లో మిజోరాం జట్టు 392 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి ఆలౌట్ అయ్యే ప్రమాదంలో పడింది. ఆ సమయంలో మిగిలిన బ్యాటర్లు కేవలం 14 రన్స్ మాత్రమే సహకారం అందించినప్పటికీ, సుతార్ మాత్రం సింగిల్స్, బౌండరీలతో మైదానమంతా పరుగులు రాబట్టాడు.

భారీ స్కోరు: చివరి వికెట్‌కు అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 581/9 (డిక్లేర్డ్) కు చేర్చాడు. మొత్తం 581 పరుగుల్లో చిన్మయ్ ఒక్కడే ఏకంగా 400 పరుగులు సాధించడం విశేషం.

**ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 10వ బ్యాటర్:**

భారత రంజీ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు కేవలం బీబీ నింబాల్కర్ (డీ. డీ. చీఅఎమ్మిశ్రీమ్మితీ) మాత్రమే 400 కంటే ఎక్కువ పరుగులు చేశారు. 1948లో కాథియావాడ్‌పై మహారాష్ట్ర తరపున ఆడుతూ నింబాల్కర్ అజేయంగా 443 రన్స్ కొట్టాడు. ఇప్పుడు దాదాపు ఎనిమిది దశాబ్దాల తర్వాత ఆ రికార్డు సరసన నిలిచిన రెండో భారత బ్యాటర్‌గా చిన్మయ్ నిలిచాడు.

ప్రపంచ ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 400ం కంటే ఎక్కువ పరుగులు సాధించిన 10వ బ్యాటర్‌గా చిన్మయ్ సుతార్ రికార్డులకెక్కాడు.

**ఇంతకీ ఎవరీ ఈ చిన్మయ్ సుతార్:**

మే 3, 1997న జన్మించిన చిన్మయ్ సుతార్ ముంబైలో పెరిగి, ముంబై జట్టుకే కాకుండా 2019 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత్ అండర్ -23 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం మంచి అవకాశాల కోసం మిజోరాం జట్టులోకి మారిన చిన్మయ్, తన అద్భుతమైన ప్రతిభతో ఇండియన్ డొమెస్టిక్ క్రికెట్‌లో తన ఉనికిని చాటుకున్నాడు.

# స్వర్ణ పతకాలతో దూసుకెళ్తున్న భారత్.. సౌమ్య, రింకు, నిషాద్ అదుర్స్!

జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా పారా గేమ్స్ 2026 లో భారత పారా అథ్లెట్లు సంచలనం సృష్టిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన అద్భుత విజయాలతో ఇండియా ఖాతాలో పసిడి పతకాలు వచ్చి చేరుతున్నాయి. కేవలం నిమిషాల వ్యవధిలోనే భారత అథ్లెట్లు మూడు స్వర్ణ పతకాలను సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు.

**1500 మీటర్ల పరుగులో సౌమ్య కుమార్‌కి పసిడి:**

మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో తన గైడ్ భారత్ కుమార్ తో కలిసి బరిలోకి దిగిన సౌమ్య కుమార్ అద్భుతమైన టైమింగ్‌తో రేసును ముగించింది. పాయింట్ల ప్రాతిపదికన జరిగిన ఈ హోరాహోరీ పోరులో అగ్రస్థానంలో నిలిచి దేశానికి మరో స్వర్ణ పతకాన్ని అందించింది.

**లాంగ్ జంప్‌లో నిషాద్‌కి గోల్డ్:**

హైజంప్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్, తొలిసారి లాంగ్ జంప్ ఈవెంట్‌లో బరిలోకి దిగాడు. ఏమాత్రం




తడబడకుండా అద్భుతమైన జంప్ చేసి 7.11 మీటర్ల దూరంతో తొలిసారే పసిడి పతకాన్ని ముద్దాడి సరికొత్త చరిత్ర సృష్టించాడు.

**జావెలిన్ త్రోలో రింకూ సంచలన విజయం:**

పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రో ఫైనల్ పోటీ అత్యంత రసవత్తరంగా కొనసాగింది. తోటి భారత అథ్లెట్ అజిత్ సింగ్ చివరి క్షణాల వరకు స్వర్ణ పతకం సాధించేలా కనిపించినప్పటికీ, చివరి ప్రయత్నంలో అద్భుతమైన త్రో విసిరిన రింకూ అనూహ్యంగా అజిత్ సింగ్‌ను వెనక్కి నెట్టి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుని స్టేడియాన్ని హోరెత్తించాడు.

# బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అదరగొట్టిన రింకు సింగ్.. భారత జట్టులో చోటు దక్కేనా?

టీ20 క్రికెట్‌లో తన సిక్సర్లతో ప్రపంచవ్యాప్తంగా ది బెస్ట్ ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఉత్తరప్రదేశ్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ , ఇప్పుడు రెడ్ బాల్ (ఫస్ట్ క్లాస్) క్రికెట్‌లోనూ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. రంజీ క్రికెట్లో 2026-27 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ సాధించాడు. గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఒంటరిగా రింకూ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన బ్యాటర్లలో అత్యధిక బ్యాటింగ్ యావరేజ్ ఉన్న టాప్-10 ప్లేయర్స్ లిస్టులో 9వ స్థానానికి ఎగబాకాడు. ఈ ఆల్-టైమ్ గ్రేట్ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

**గోవాతో మ్యాచ్‌లో ఒంటరి పోరాటం:**

గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ టీమ్ బ్యాటింగ్ విభాగం ఘోరంగా విఫలమైంది. వరుసగా వికెట్లు కోల్పోయి ఒక దశలో 137 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అత్యంత సంయమనం ప్రదర్శిస్తూ 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివరి వికెట్‌కు వంశ్ చౌదరితో కలిసి విలువైన పరుగులు జోడించి జట్టు స్కోరును 202 పరుగులకు చేర్చాడు.

**వినోద్ కాంబ్లీ రికార్డ్ బ్రేక్ చేసిన రింకు:**

ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బీహార్‌పై 112 రన్స్ చేసిన రింకూ, తాజాగా గోవాపై 118 నాటౌట్‌తో వరుసగా రెండో శతకాన్ని నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో రింకూ ఫస్ట్ క్లాస్ బ్యాటింగ్ సగటు 61.33కు పెరిగింది. దీంతో అంతకుముందు 59.67 సగటుతో ఉన్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ రికార్డును రింకూ సింగ్ బ్రేక్ చేసేశాడు. ఇప్పటి వరకు 55 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రింకూ, 78 ఇన్నింగ్స్‌ల్లో 3,987 పరుగులు బాదేశాడు. ఇందులో 11 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గానూ అతను నిలిచాడు.



**ఫస్ట్ క్లాస్ ఆల్-టైమ్ హైయెస్ట్ యావరేజ్ జాబితా:**

డాన్ బ్రాడ్‌మన్ - 95.14
విజయ్ మర్చంట్ - 71.64
జార్జ్ హెడ్లీ - 69.86
అజయ్ శర్మ - 67.46
విలియం పాన్స్ఫోర్డ్ - 65.18
విలియం వుడ్‌ఫుల్ - 64.99
శాంతను సుగ్వేకర్ - 63.10
సర్ఫరాజ్ ఖాన్ - 62.92
రింకూ సింగ్ - 61.33
కే.సీ.ఇబ్రహీం - 61.24

**లాస్ట్11 ఇన్నింగ్స్‌ల్లో రింకు కిరాక్ ఫామ్:**

రింకూ సింగ్ తన చివరి 11 ఫస్ట్ క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 850 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌ల సగటు 94.44గా ఉండటం విశేషం.

కేవలం టీవీల్లో సిక్సర్లు కొట్టే ప్లేయర్‌గానే కాకుండా, రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను నిలకడగల బ్యాటర్‌నని రింకూ నిరూపించుకుంటున్నాడు. ఈ సూపర్ ఫామ్ చూశాక, భారత టెస్టు జట్టులోకి అతనికి పిలుపు వస్తుందనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా కొనసాగుతోంది.

# తమన్నా బోల్డ్ ప్లానింగ్ దిమ్మతిరిగేలా!

దాదాపు 18 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా.. విభిన్నమైన పాత్రలతో కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఒకప్పుడు కమర్షియల్ సినిమాలు, గ్లామర్ పాత్రలు, డ్యాన్స్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు ఓటీటీ, హారర్, బోల్డ్ కంటెంట్ ఉన్న కథలతోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.'లస్ట్ స్టోరీస్ 2', 'జీ కర్దా' వంటి ప్రాజెక్టుల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన తమన్నా.. ప్రస్తుతం 'రాగిణి 3'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ హారర్ చిత్రానికి సంబంధించిన షూటింగ్ 2026 జూలైలో ప్రారంభమైంది. 2027లో విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, ఏక్తా కపూర్ 'ది డర్టీ పిక్చర్ 2'ను రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో ఈ సినిమాపైనా ఆసక్తి పెరిగింది. అయితే ఇందులో తమన్నా నటించనున్నారనే వార్తకు ఇంకా అధికారిక ధ్రువీకరణ లేదు.మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా కథలను ఎంచుకుంటున్న తమన్నా.. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త తరహా కథలతో ఆమె ఎలాంటి విజయాలు అందుకుంటారో చూడాలి.



# ఆ నలుగురు స్టార్ హీరోల ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్‌న్యూస్



లీవుడ్‌లో దసరా సందడి కనిపిస్తోంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు సందడి చేస్తున్న విషయం తెల్సిందే. దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం చాలా సినిమాలు విడుదల అయ్యాయి. అందులో కొన్ని సినిమాలను తెలుగు ప్రేక్షకులు తిరస్కరిస్తే, కొన్ని సినిమాలకు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు అవుతున్నాయి. మొత్తానికి టాలీవుడ్ బాక్సాఫీస్ కళకళలాడుతోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దసరాకు స్టార్ హీరోల సినిమాలు, సూపర్ స్టార్ హీరోల సినిమాలు రాలేదు. అయినా కూడా ప్రేక్షకులు వచ్చిన సినిమాలను చూస్తూ దసరా పండుగ చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇక దసరా పండుగ సందర్భంగా స్టార్ హీరోల సినిమాల నుంచి కీలక అప్‌డేట్స్ వస్తాయని ఆయా హీరోల అభిమానులు, మీడియా వర్గాల వారు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ సినిమాల అప్‌డేట్స్...**

ముఖ్యంగా ప్రభాస్ నటించిన ఫౌజీ, స్పిరిట్ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాదిలో ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. దసరా లేదా దీపావళి వరకు ప్రభాస్ సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ ను ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇటీవలే ప్రభాస్ స్పిరిట్ సినిమా వచ్చే ఏడాది దీపావళికి విడుదల కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే ఫౌజీ సినిమా విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. దసరా లేదా దీపావళి సందర్భంగా ప్రేక్షకులకు ఆ సినిమా అప్‌డేట్ ఇస్తే తప్పకుండా మంచి రీచ్ ఉంటుంది అనే అభిప్రాయం ను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. అందుకే ప్రభాస్ రెండు సినిమాల అప్‌డేట్స్(టీజర్/పోస్టర్స్) అతి త్వరలోనే రానున్నాయి.

**రంగస్థలం తర్వాత చరణ్-సుకుమార్ కాంబో మూవీ...**

ఇక రామ్ చరణ్, సుకుమార్ కాంబోలో రూపొందుతున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన సైతం ఇదే ఏడాది వస్తుందని తెలుస్తోంది. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో గతంలో రంగస్థలం సినిమా వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా రామ్ చరణ్‌కి మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇక సుకుమార్ దర్శకత్వంలో ఆ తర్వాత వచ్చిన పుష్ప రికార్డ్‌ల వర్షం కురిపించింది. పాన్ ఇండియా రేంజ్‌లో పుష్ప సినిమాను విడుదల చేయడం జరిగింది. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల పుష్ప ప్రభంజనం కనిపించింది. అందుకే రామ్ చరణ్‌తో సుకుమార్ చేయబోతున్న సినిమాను సైతం పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకులు అలరిస్తారనే నమ్మకం వ్యక్తం అవుతుంది. ఆ సినిమా తాలూకు అప్‌డేట్ ను మరికొన్ని రోజుల్లోనే సుకుమార్ అండ్ టీం నుంచి వినబోతున్నాం. మైత్రి మూవీ మేకర్స్ వారు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాల అప్డేట్స్...**

ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ సైతం అతి త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ డ్రాగన్ షూట్‌లో పాల్గొంటున్నాడు. దసరా కి ప్రత్యేకంగా సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు ప్రశాంత్ నీల్ వీడియోను రెడీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పండుగకి ఒక మంచి పోస్టర్ విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీ, ఇతర విషయాలకు సంబంధించిన వివరాలను క్లారిటీగా చెప్పే అవకాశం ఉంది. కనుక అతి త్వరలోనే ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి డ్రాగన్ యూనిట్ నుంచి పెద్ద సర్‌ప్రైజింగ్ న్యూస్ రావడం కన్ఫర్మ్ అయింది. ఎన్టీఆర్-నీల్ కాంబో డ్రాగన్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌ను మించి విడుదల కాబోతున్నట్లుగా చెబుతున్నారు. కనుక సినిమా అప్‌డేట్ వస్తుంది అంటే కచ్చితంగా ఫ్యాన్స్ కి పెద్ద గుడ్ న్యూస్ కాదా మరి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న 'రాకా' సినిమా అప్‌డేట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హాలీవుడ్ రేంజ్ మూవీ అంటూ రాకా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కనుక రాకా సినిమా నుంచి వచ్చే అప్‌డేట్ కి పాన్ ఇండియా రేంజ్‌లో క్రేజ్ ఉంటుంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి అతి త్వరలోనే ఆ రేంజ్ సర్‌ప్రైజ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక వైపు రాకా సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ అల్లు అర్జున్ నుంచి అతి త్వరలోనే కొత్త సినిమా అప్‌డేట్ వస్తుందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా ఈ రెండు మూడు నెలల్లోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అల్లు అర్జున్ కొత్త సినిమా దర్శకుడు ఎవరు, ఇతర అప్‌డేట్స్ ఏంటీ అనేది ఇదే ఏడాది చివరి వరకు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. కనుక అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి కూడా అతి త్వరలోనే రెండు బిగ్ గుడ్ న్యూస్ వినిపించే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి నలుగురు స్టార్ హీరోలు వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ఏడాదిలో ఈ స్టార్ హీరోల ఫ్యాన్స్ కోసం బిగ్ అప్‌డేట్స్ వదలబోతున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com